క్లుప్తంగా

వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘ సభ్యులు

ముమ్మిడివరం: వచ్చేనెల 5న విజయవాడలో నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను బుధవారం ముమ్మిడివరంలో ఆవిష్కరించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగుల సంఘం సముదాయం వద్ద వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడు వీరబాబు, కార్యదర్శి మల్లిబాబు, ఉపాధ్యక్షుడు విజయకుమార్,శ్రీనివాస్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సమస్యలపై ఆందోళన

తాళ్లరేవు: నీలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు బుధవారం ఆందోళన వ్యక్తం చేసారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడుతూ కాలనీకి దారి సక్రమంగా లేదని, తాగేందుకు మంచినీళ్లు లేవని వాపోయారు. వర్షం వస్తే కాలనీలో నీరు నిలబడిపోతోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ చిట్టూరి నాగమణిని కోరారు.

వీధి లైట్లకు మరమ్మతులు



విలసవిల్లిలో వీధి దీపాల మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, కార్యదర్శి డి.శివ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుమారు 150 పని చేయని వీధి లైట్లను మరమ్మతులు చేయడానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ, గ్రామంలో పదేళ్ల క్రితం ఎల్ఈడీ వీధి దీపాలను అమర్చారని, అవి పనిచేయక పోవడంతో ప్రజలు రాత్రిళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాంకేతిక నిపుణులతో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి శివ ప్రసాద్ ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



సత్తి గవర్రాజు (ఫైల్)

అమలాపురం రూరల్: సవరప్పాలెం చెందిన శతాధిక వృద్ధురాలు సత్తి గవర్రాజు (105) మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె మాజీ సర్పంచ్ సత్తి నాగేశ్వరరావు మాతృమూర్తి. ఈమెకు కుమారులు, కుమార్తెలు, మనుమలు, ముని మనుమలు ఉన్నారు. ఆమె కుమారుడు నాగేశ్వరరావు, కోడలు నాగేశ్వరమ్మ, మనవడు నాగబాబు సర్పంచ్‌లుగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. గవర్రాజు మృతి పట్ల గోదావరి ప్రాజెక్ట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సత్తి శ్రీను, మాజీ సర్పంచ్ సత్తిసాయిబాబు, పలువురు నాయకులు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలోని సావరం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబాజీపేటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇద్దరు యువకులు గాయపడినట్లు బుధవారం అందిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. బాధిత యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజమహేంద్రవరానికి చెందిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అమలాపురంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై అంబాజీపేట వైపునకు వెళుతున్న కొర్లపాటి లక్ష్మణ సాయి, చిక్కం గోపిని లారీ ఢీకొట్టింది. గాయాలపాలైన బాధిత యువకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోవిడ్ లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వారం రోజుల్లో 12 కోవిడ్-19 కేసులు నమోదవడంతో బుధవారం ఆరోగ్యశాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. వారం రోజులుగా పలువురికి పరీక్షలు నిర్వహించగా కోవిడ్ పాజిటివ్‌గా నమోదయ్యిందని తెలిపారు. ఈ నేపథ్యంలో వారిని స్వీయ ఐసోలేషన్‌లో ఉంచినట్లు వైద్యం అందించినట్లు తెలిపారు. ఎవరైనా జ్వరం, దగ్గు, రొంప తదితరవాటితో బాధపడుతుంటే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, జీజీహెచ్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

చేనేతలకు చేయూత కరవు!

- కుటుంబమంతా కష్టపడినా అరకొర ఆదాయం
- గత ప్రభుత్వంలో ఏటా రూ.24వేల ఆర్థిక సహాయం
- కూటమి ప్రభుత్వంలో అందని పరిహారం
- సంక్షేమ పథకాల కోసం నేతన్నల ఎదురుచూపు



సంక్షేమ పథకాలు లేక వెలవెలబోతున్న ఇంజరం చేనేత సంఘం



భార్యాభర్తలు ఇద్దరూ నేత పనిలో నిమగ్నం

తాళ్లరేవు: చేనేత పరిశ్రమలో విద్యుత్ మగ్గాల ప్రోత్సాహంతో చేనేత కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కుటుంబమంతా రోజంతా కష్టపడినా రూ.500 ఆదాయం దాటడం లేదు. దీంతో నేతన్నలు చేనేత పరిశ్రమకు దూరమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేతన్నల దయనీయ పరిస్థితిని గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసారు. దీంతో చేనేతకు దూరమైన కార్మికులు తిరిగి పరిశ్రమ వైపు మళ్లారు. కూటమి ప్రభుత్వం చేనేతల కష్టాలను ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు దాటినప్పటికీ ఒక్క రూపాయి పరిహారాన్ని ఇవ్వకపోవడంతో చేనేత కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేతన్న నేస్తం కొనసాగేనా?

చేనేతల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అందించిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం వారి జీవితాలకు కొండంత అండగా ఉండేది. ప్రస్తుతం ఆ పథకం కోసం చేనేత కార్మికులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.24 వేల చొప్పున వారి ఖాతాల్లో ఏటా జమ చేసేది. ఒక్కొక్క చేనేత కార్మికునికి గడచిన ఐదేళ్లలో రూ.లక్షకు పైగా లబ్ధి చేకూరింది. అయితే కూటమి ప్రభుత్వం ఆ పథకం ఊసే ఎత్తకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డర్లు రాక ఆర్థిక ఇబ్బందులు

ఏటా సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచే మాస్టర్ వీవర్స్ నుంచి అనేక ఆర్డర్లు వచ్చేవి. అయితే ఈ ఏడాది ఆ ఆర్డర్లు కూడా ఊహించిన స్థాయిలో రాకపోవడంతో చేసేందుకు పనిలేకుండా పోయిందని వాపోతున్నారు. తమకు ఈ చేనేత తప్ప మరో పని తెలియదని, ప్రభుత్వం సహాయం అందించకుంటే వలస పోవడం తప్ప వేరే మార్గం లేదని వారంటున్నారు. గతంలో చేనేత సహకార సంఘాల సభ్యులకు ఆప్కో ద్వారా ఉన్న బకాయిలను ప్రభుత్వం దఫదఫాలుగా విడుదల చేసి చేయూతగా నిలిచేది. ప్రస్తుతం ప్రభుత్వం బకాయిలు కూడా చెల్లించే పరిస్థితి లేదని పలువురు చేనేత కార్మికులు వాపోతున్నారు. తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు చేయూతను అందించి చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలని, ప్రభుత్వం వచ్చే నెలలో అందజేయనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకంతో పాటు నేతన్న నేస్తం అమలు చేయాలని వారంతా కోరుతున్నారు.

నేతన్న నేస్తం అందించాలి



కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో పనుల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నాము. రోజుకు సుమారు 14 గంటల కష్టపడ్డా రూ.500 ఆదాయం దాటడం లేదు.
పనుల్లేక పస్తులుంటున్న తమకు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని అందించి ఆదుకోవాలి. గతంలో మాదిరిగా ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయం అందించాలి. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాన్ని కూడా అమలు చేయాలి.
– నూలు వీరవెంకటసత్యనారాయణ, చేనేత కార్మికుడు

జీఎస్టీని తొలగించాలి



చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించడంతో లాభాల్లో కోత పడుతోంది. గతంలో నూలుపై సబ్సిడీ, పావలా వడ్డీకే రుణాలు తదితర పథకాలు ఉండేవి. వాటిని రద్దు చేయడంతో ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతగిలింది. పథకాలను పునరుద్ధరించడంతోపాటు జీఎస్టీని తొలగిస్తే చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం వస్తుంది.
– ముద్దన వెంకట శివరామ ప్రసాద్, చేనేత సంఘం నాయకులు, సర్పంచ్, ఇంజరం

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్ప ఆలయంలో మేధాదక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దాత వరప్రసాద్ దంపతులు

అమలాపురం రూరల్: కోనసీమ మహాశాస్తా అయ్యప్ప స్వామి ఆలయం 18వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, దుర్గా నవ గ్రహ హోమాలు, మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. ఆలయంలో మేధాదక్షిణామూర్తి విగ్రహాన్ని పల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో విగ్రహ దాత చాగంటి వరప్రసాద్ దంపతులు ప్రతిష్ఠించారు. వేలాది మందికి భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమ్ముడు చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, ఆలయ కమిటీ సభ్యుడు మోరం దొరబాబు, రామయణం వెంకటేశ్వరరావు, కోనా వెంకట్రాజును ఘనంగా సత్కరించారు.

ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసిన అమలాపురం పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ శ్రీకాంత్ అల్లవరం మండలానికి సంబంధించి పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలసి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కొద్దిసేపు మాట్లాడారు. డాక్టర్ శ్రీకాంత్ ప్రజాప్రతినిధులను ఒక్కొక్కరినీ వ్యక్తిగతంగా జగన్‌మోహన్‌రెడ్డికి పరిచయం చేశారు. అల్లవరం మండల ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ అమలాపురం మున్సిపాలిటీలో నెలకొన్న పరిణామాలను వివరించారు. త్వరలోనే అమలాపురం మున్సిపాలిటీకి సంబంధించి పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లను తాడేపల్లిలో కలిసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారని డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. రాబోయేది మన ప్రభుత్వమేనని ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అధ్యక్షుడు జగన్ సూచించినట్టు నాయకులు తెలిపారు. మాజీ సీఎం జగన్‌ను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచులు రాకాపు విజయలక్ష్మి, సీతారత్నం, ఎంపీటీసీ సభ్యులు గుబ్బల రంగనాథస్వామి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, బసవాని పద్మ, దొమ్మేటి శాంతిభవానీ, కో ఆప్షన్ సభ్యుడు పల్లి జేమ్స్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో గందరగోళం



మత్స్యకార పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, మల్లాడి

యానాం: మత్స్యకారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వేదికపై బుధవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పరస్పరం ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. నియోజకవర్గ పరిధిలో 278 మంది మత్స్యకారులకు పింఛన్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ కార్యక్రమం స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు పింఛన్లు అధికంగా మంజూరయ్యాయన్నారు. ఓఎన్‌జీసీ తదితర సంస్థల ద్వారా వస్తున్న వేట నష్టపరిహారాన్ని ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని లబ్ధిదారులు పూర్తి హక్కుదారులని స్పష్టం చేశారు. అనంతరం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా తాను మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఫిషరీస్ ఏడీ దడాల గొంతియ్య, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్ పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు ముస్తాబు

కాషాయ జెండాలతో రెపరెపలాడుతున్న అమలాపురం



అమలాపురంలో కాషాయ జెండాల అలంకరణ

అమలాపురం టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా యువతకు సనాతన ధర్మంపై మరింత అవగాహన పెంచేందుకు గురువారం విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ సంయుక్తంగా అమలాపురం పట్టణంలో నిర్వహించే విజయోత్సవ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) కోసం పట్టణం ముస్తాబైంది. పట్టణంలో ఏ రోడ్డు చూసినా కాషాయ జెండాలతో అమలాపురం రెపరెపలాడుతోంది. శోభాయాత్ర ప్రారంభమయ్యే స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులో 216 జాతీయ రహదారి చెంతనున్న త్రిముఖ గణపతి ఆలయం నుంచి పట్టణంలోని మెయిన్ రోడ్లు అంతటా కాషాయ జెండాలను తోరణాలుగా కట్టి సరికొత్త శోభను తెచ్చారు. హైస్కూలు సెంటర్, గడియారం స్తంభం, ముమ్మిడివరం గేటు సెంటర్, నల్లవంతెన రోడ్డు, ఎర్ర వంతెన రోడ్డు, ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు, కొంకాపల్లి కూడలి వరకు కాషాయ జెండాలను అలంకరించారు. పట్టణంలో ఉన్న దేవస్థానాలు, ఆలయాలను కాషాయ జెండాలతో అలంకరించారు. వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధులు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, రాళ్లపల్లి పాపయ్య శర్మ, శిరంగు నాయుడు, కాళ్లకూరి కుమార్, ఊటుకూరి సాంబయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. త్రిముఖ గణపతి ఆలయం నుంచి మొదలయ్యే శోభాయాత్ర పుర వీధుల్లో హనుమాన్ నామస్మరణతో, హిందూ ధర్మ ప్రచారంతో, సనాతన ధర్మంపై అవగాహన కల్పిస్తూ సాగనుందని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

స్టాక్ పాయింట్ పరిశీలన



ముమ్మిడివరంలో విద్యామిత్ర కిట్లు స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మీ

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు భద్రపర్చిన స్టాక్ పాయింట్‌ను బుధవారం జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ పరిశీలించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రావల్సిన స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యామిత్ర కిట్లు పాఠశాల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లాలోని 6 నుంచి 18 సంవత్సరాల ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల వివరాలను సేకరించి వారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యేటట్లు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, జీసీడీఓ ఏంఏకే భీమారావు, మండల విద్యాశాఖాధికారి ఆర్.ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

సచివాలయానికి ఒక వీఆర్వోను నియమించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ దివాకర్, జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్వరరావు

అమలాపురం రూరల్: క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు కలిపి ఒకే వీఆర్వో ఉండే విధంగా మ్యాపింగ్ చేస్తున్న పరిస్థితుల్లో ఒక సచివాలయానికి ఒక వీఆర్వో ఉండేట్లు నిర్ణయం తీసుకోవాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతిని కోరారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు పడుతున్న ఇబ్బందులు వారికి వివరించారు. రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్, జిల్లా అధ్యక్షుడు సాధనాల ఎల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, సహ అధ్యక్షుడు కె.గణేష్ కలెక్టర్‌ను బుధవారం కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు స్వామినాయుడు, సంఘం నాయకులు సత్యనారాయణ, బాబ్జి జిల్లాలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాల బాలికలకు యోగా శిక్షణ



యోగాంధ్ర శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈవో బాషా, మున్సిపల్ కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: అమలాపురం ఓం శాంతి కార్యాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక గురిగుంట చెరువు వద్ద గల ఓం శాంతి హార్మోనీ హౌస్‌లో బాల బాలికలకు వేసవి ఉచిత యోగా శిక్షణ శిబిరం బుధవారం నుంచి మొదలైంది. ఓం శాంతి కేంద్రం ఇన్‌ఛార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి ఆధ్వర్యంలో యోగాంధ్ర శిబిరం ఏర్పాటైంది. డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఈ ఉచిత యోగా శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యోగా శిబిరానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎంపీపీ అనూరాధ దంపతులు అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ వేసవి ఉచిత యోగా శిక్షణ శిబిరం నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారీలు తెలిపారు. ఉచిత యోగా శిక్షణకు దాదాపు 100 మంది బాలి బాలికలు హాజరయ్యారు. బ్రహ్మకుమారీలే యోగా గురువులుగా రాజయోగాపై శిక్షణ ఇచ్చారు. అమలాపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఓంశాంతి భవనంలో యోగా శిక్షణ ఇస్తున్న బ్రహ్మకుమారీలను సత్కరించి వారికి వాకర్స్ ప్రతినిధులు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, వాకర్స్ ప్రతినిధులు కుడుపూడి త్రినాథ్, బూరగాయల శివరామకృష్ణ, పట్నాల రమణ పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దు అన్యాయం

ఐ.పోలవరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిలిపివేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం అన్యాయని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఐ.పోలవరం మండల పరిధిలో జి.మూలపొలం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న యర్రగరువులో రేషన్ షాప్‌ను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలిం రేషన్ దుకాణం నిర్వాహకులను పలు అంశాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి రేవు అప్పారావు ఆధ్వర్యంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ కాశి షర్మిల, ఐదవ వార్డు పంచాయతీ మెంబర్ రేవు మంగాదేవి రేషన్ దుకాణాన్ని పరిశీలించి, పంపిణీ విధానంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ ఇంటి వద్ద రేషన్ సరుకులు ఇవ్వాలని కోరారు. దుకాణాల వద్దకు వెళ్లేందుకు వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యం ఉన్న వారు చాలా ఇబ్బందులు పడతారన్నారు. వారికి రేషన్ సరుకులు ఇంటి వద్ద సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాకపల్లి వెంకట్రావు, వడ్డి ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్షలు

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో 2025-26 ప్రవేశాలకు ఏపీ ఏఈపీ సెట్ 2025 పరీక్షలు బుధవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం బ్యాచ్ 202 మందికి 187 మంది, మధ్యాహ్నం బ్యాచ్ 202 మందికి 192 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. కరస్పాండెంట్ డీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ, ఈనెల 27 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు.

పశువులపాక కూల్చివేతపై కేసు

అమలాపురం రూరల్: పశువుల పాకను దౌర్జన్యంగా కూల్చేసిన నలుగురు వ్యక్తులపై అమలాపురం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. తాలూకా ఎస్సై శేఖర్ బాబు తెలిపిన వివరాలు ప్రకారం బండారులంక నారాయణపేటలో ఇళ్ల జానకికి చెందిన కొబ్బరి తోటలో జక్కంశెట్టి శ్రీనివాస్ కాపలాగా ఉంటూ పాక వేసి పశువుల కట్టుకుంటున్నాడు అదే గ్రామానికి చెందిన ఇళ్ల మురళీకృష్ణ, భూ యాజమాని ఇళ్ల జానకి మధ్య వివాదం కారణంగా 18వ తేదీన ఇళ్ల మురళీకృష్ణ, ఇళ్ల చక్రపాణి, ఇళ్ల సుబ్రహ్మణ్యం, ఇళ్ల శ్రీనివాస్ (బాబి) తదితరులు మారణాయుధాలతో వచ్చి పాకను తొలగించి, తమను బెదిరించి దౌర్జన్యం చేసినట్టు బాధితుడు జక్కంశెట్టి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన మోటార్ సైకిల్‌లో ఉన్న రూ.12,400 అపహరించారని శ్రీనివాసరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు దౌర్జన్యానికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుధవారం తెలిపారు.

భారీ వాహనాలతో ఏటిగట్టు ఛిద్రం



ఏటిగట్టు రహదారిపై వేగంగా వెళ్తున్న భారీ వాహనాలు

తాళ్లరేవు: మండల పరిధిలోని గోవలంక, పిల్లంక తదితర గ్రామాలకు వెళ్లే గౌతమి గోదావరి ఏటిగట్టుపై భారీ వాహనాలు వేగంగా సంచరిస్తుండడంతో ఏటిగట్టు ఛిద్రమవుతోందని స్థానికులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిని ఇటీవలే మరమ్మతులతో అభివృద్ధి చేశారు. సింగిల్ రహదారిగా ఉన్న ఈ మార్గంలో పలుచోట్ల గట్టు బలహీనంగా ఉంది. ఈ రహదారిలో లారీలు, టిప్పర్లు భారీ లోడులతో వేగంగా వెళుతుండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు గాయాలపాలయ్యారని తెలిపారు. పోలీసులు దృష్టి సారించి భారీ వాహనాలు వేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పొన్నాడ పరామర్శ

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మురమళ్ల సర్పంచ్ కాలే రాజబాబు ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. రాజబాబుకు ఇటీవల ప్రమాదం జరిగి చేతికి గాయమైంది. అతను ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనను పొన్నాడతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స వాసురాజు, ఎస్.గణపతి మూర్తి వర్మ, సుంకర నాగబాబు, కె.గంగబాబు పరామర్శించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

యానాం: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం సమాచారశాఖ ఉద్యోగులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీరహదారిలో ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్రవాద వ్యతిరేక నోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆర్ఏఓ ఆఫీసులో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు పాల్గొన్నారు.

అమలాపురంలో..

అమలాపురం టౌన్: మాజీ ప్రధాన మంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని అమలాపురంలోని స్థానిక కృష్ణారావు వీధిలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఏఐసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ, డీసీసీ నాయకులు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలి

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు వేతనాలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బండారులంక, ఏ. వేమవరం గ్రామాల్లో సుబ్బారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు పి.శివదైవకృప పర్యటించారు. సుబ్బారావు మాట్లాడుతూ ఆరు వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్న ఒక్కరోజు వేతనం ప్రభుత్వం చెల్లించలేదని దీంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెట్టా ఆనందరావు అనంతలక్ష్మి, సరళ రాజు పార్వతి కృప పాల్గొన్నారు.